

విషాద ప్రయాణం

ఘోర రోడ్డు ప్రమాద ఘటన దృశ్యాలు



రమేష్‌నాయుడు

- ప్రైవేట్ కళాశాల బస్సు, కారు ఢీ
- నలుగురి దుర్మరణం
- ఒకరి పరిస్థితి విషమం

రమేష్‌నాయుడు, అతని భార్య పుష్ప, వదిన వనజాక్షి, దగ్గరి బంధువులు భాను, శివమ్మలతో కలిసి ఉత్సాహంగా చెన్నయ్ పెరంబూరులో శుక్రవారం ఉదయం జరిగిన నిశ్చితార్థానికి అందంగా అలంకరించుకుని వెళ్లారు. పట్టుచీరల్లో, బంగారు నగలు ధరించి వేడుకలో పాల్గొన్నారు. సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రైవేట్ డిగ్రీ కళాశాల బస్సును కారు ఢీకొంది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతదేహాలు తలలు పగిలి, మొహంపై రక్తగాయాలై కళావిహీనంగా కనిపించాయి. ఎంతో ప్రయాసతో మృతదేహాలను కారులోనుంచి తొలగించి పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషమ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్న శివమ్మను తిరుపతి రుయాకు చికిత్స నిమిత్తం తరలించారు. ఎంతో సంతోషంగా నిశ్చితార్థ వేడుకకు వెళ్లి వస్తున్న ఆ కుటుంబంలో సాయంత్రం విషాదం అలముకుంది.

ప్రజాశక్తి - పిచ్చాటూరు

చెన్నయ్ పెరంబూరులో జరిగిన బంధువుల నిశ్చితార్థ వేడుకకు వెళ్లి వస్తుండగా కారును ఓ ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడిన శివమ్మను తిరుపతి రుయాకు చికిత్స నిమిత్తం తరలించారు. తిరుపతి జిల్లా నారాయణవనం పోలీసు స్టేషన్ సమీపంలోని తిరుపతి చెన్నయ్ జాతీయ రహదారిపై సముదాయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో స్కూలు విద్యార్థులకూ స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించబోయి ఎదురుగా వస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాల




బస్సును ఢీకొంది. స్థానికుల వివరాల మేరకు...

తిరుపతి -చెన్నై జాతీయ రహదారి పై శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు పుత్తూరు లోని శ్రీవిద్య ప్రైవేట్ కళాశాల బస్సు, కారు ఢీకొన్నాయి. పుత్తూరు మండలం పరమేశ్వర మంగళం గ్రామానికి చెందిన రమేష్ నాయుడు కుటుంబానికి చెందిన ఐదుగురు పెరంబురులో నిశ్చితార్థానికి వెళ్లివస్తూ ఈ ప్రమాదంలో మృతి చెందారు. రమేష్ నాయుడు(60), అతని భార్య పుష్ప (55), సమీప బంధువు భాను (42), వదిన వనజాక్షమ్మ(60) అలియాస్ అమ్ములమ్మ సంఘటన స్థలంలో మతి చెందారు. బంధువు శివమ్మ (55) పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌నాయుడు సిమెంట్ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ఘటనలో భార్యాభర్తలిద్దరూ విగతజీవులయ్యారు. పుత్తూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.. ఈ ఘటనలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులూ స్వల్పంగా గాయపడ్డారు.

ఐదు క్లెయిములు మించితే క్రిమినల్ కేసులు తప్పవు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఒక వ్యక్తి ఐదు క్లెములకంటే ఎక్కువ నమోదు చేస్తే వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్‌మీనా అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి అన్ని జిల్లా అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కసరత్తును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ముసాయిదా ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులు, రాజకీయపార్టీల ఫిర్యాదులు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిపిసిలు, డిఎస్ఈలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్, జెసి శ్రీనివాసులు, డిఆర్‌వో రాజశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులుంటే ఎపిక్ కార్డు జనరేట్ చేసి వెంటనే పోస్ట్ ద్వారా పింపేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఫారం 6, 7, 8క్లెయిములను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఒకే నెంబర్‌తో 10మంది ఓటర్లు ఉంటూ బిఎల్‌వోలు క్షేత్ర స్థాయి పరిశీలన తప్పనిసరిగా చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం అందిన క్లెయిములు అన్నింటినీ నిర్ణీత గడువు లోపు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని, రాజకీయ పార్టీల నుండి అందిన ఫిర్యాదులను బూత్ స్థాయి అధికారులతో ఇంటింటి విచారణ చేపట్టి ఓటర్ల జాబితాలో సవరించే ప్రక్రియను పూర్తి చేస్తున్నామన్నారు. యువ ఓటర్ల నమోదు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి స్వీప్ యాక్టివిటీస్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వర్చువల్ సమావేశంలో హాజరైన కలెక్టర్, జెడి, డిఆర్‌వో

హమారా సంకల్ప వికసిత్ భారత్
యాత్రను విజయవంతం చేయండి

- జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలి
- కేంద్ర కన్జ్యూమర్ అఫైర్స్ అధికారి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వీక్షించేందుకు ఈ నెల 27నుంచి నిర్వహించనున్న హమారా సంకల్ప వికసిత్ భారత్ యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అధికారి సచింద్ర కుమార్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కేంద్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తోపాటు ఈ యాత్ర కోసం నియమితులైన 37 మంది జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఈ కమిటీ ఉండాలని రిసీవింగ్ కమిటీ, కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి మరొక కమిటీ ఉండాలని ఇందులో పంచాయతీ పరిధిలోని ఉద్యోగులందరూ ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాన్ని మానిటరింగ్ చేసేందుకు 37 మంది జిల్లా స్థాయి అధికారుల నియామకం జరిగినట్లుగా జాయింట్ కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఆరు వాహనాలు పర్యటిస్తాయని ఒక్క వాహనం రోజూ రెండు గ్రామపంచాయతీలలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం తరపున చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించి ఆ గ్రామంలో వివరించడం జరుగుతుందని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

ఓటరు జాబితాలో మార్పులకు అవకాశం

- బిఎల్‌వోల పరిశీలన తరువాతే ఏఈఆర్‌వోలు నమోదు చేయాలి
- అధికారులకు జెసి శ్రీనివాసులు దిశానిర్దేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వబడిందని జెసి శ్రీనివాసులు అన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్వోలు పరిశీలించిన తర్వాతనే ఆపై అధికారులు నిర్ధారించడం చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ రాజశేఖర్‌తో కలిసి ఎన్నికలకు సంబంధించిన మండల ప్రత్యేక అధికారులతో సమావేశం అయ్యారు. ఆయా మండల పరిధిలో ఓటర్ల జాబితాలో చేర్పులకు, అడ్రస్ మార్పులకు, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాల గురించి ఆ ఓటర్ల సంఖ్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా అత్యంత ప్రధానమైనదని క్షేత్రస్థాయిలో ఎవరు ఎటువంటి తప్పులు చేసిన ఎన్నికల కమిషన్ దీనిని తీవ్రంగా తీసుకుంటుందని అటువంటి పరిస్థితి తెచ్చుకోకుండా నిర్ణయించిన కాలపరిమితి మేరకు ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలన్నారు.

రేపు తిరుమలకు మోదీ రాక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తెలంగాణా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ రాష్ట్రానికి రానున్న ప్రధాని మోదీ, స్వామి కార్యమూ పూర్తి చేసుకోనున్నారు. ఈనెల 26, 27 తేదీల్లో తిరుమలలో శ్రీవారిని దర్శించుకోనున్నారు. 26న రాత్రి తిరుమలలోనే బస చేయనున్నారు. ప్రధాని మోదీకి సిఎం జగన్మోహన్‌రెడ్డి, గవర్నర్ స్వాగతం పలకనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్రస్థాయి అత్యున్నత సమన్వయ సమావేశం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వరరెడ్డి, జేసీ డీకె బాలాజీ, టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డిలు వర్చువల్ విధానంలో హాజరయ్యారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి వివరిస్తూ భారత ప్రధాని తిరుపతి ఇంటర్నేషనల్ విమానాశ్రయం దగ్గర దిగినప్పటి నుంచి తిరుగు ప్రయాణం వరకూ అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేస్తున్నామన్నారు. సంబంధిత అధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించి విధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్టు డాక్టర్లు ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, 108, సేఫ్ రూమ్, తదితరాలు ఏర్పాటు, అలాగే ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ ఏర్పాటు, తగినంత లైటింగ్ ఏర్పాటు, రవాణా శాఖ వాహనాల ఫిట్నెస్ చెక్, కమ్యూనికేషన్ ప్లాన్ ఇంటర్నెట్ టెలిఫోన్ సదుపాయాలు, శానిటేషన్ ఏర్పాట్లు, అవసరమైన చోట బ్యారికేడింగ్, రోడ్డు మరమ్మత్తులు చేపట్టడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. భారత ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ రానున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన ఏర్పాట్ల కొరకు అధికారులకు విధులు కేటాయించామని అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. టీటీడీ ఈఓ మాట్లాడుతూ ప్రధాని తిరుమల చేరుకున్నప్పటి నుండి వారికి వారి సిబ్బందికి, సిఎం, గవర్నర్‌లకు వసతి, ఆహారం, దర్శనం అన్నీ ప్రణాళికా బద్ధంగా చేపడతామని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ తగినంత బందోబస్తుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఎస్వీయూకు నాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్ : వీసీ



ప్రజాశక్తి - క్యాంపస్ ఎస్వీ యూనివర్సిటీకి యుజిసి నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించిందని వీసీ ప్రొఫెసర్ కె రాజారెడ్డి వెల్లడించారు. యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక యూజీసీ నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ ను యూనివర్సిటీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. యూనివర్సిటీలోని వివిధ కాలేజీలు, విభాగాలు బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అత్యద్భుతమైన ప్రగతిని సాధించాయని చెప్పారు. దీనిని గుర్తించి నాక్ బందం ఏ ప్లస్ గ్రేడ్ ప్రకటించిందని తెలిపారు. ముఖ్యంగా సైన్స్ లోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయో కెమిస్ట్రీ తదితర విభాగాలు సుమారు రూ. 100 కోట్ల పరిశోధన ప్రాజెక్టులు నిర్వహిస్తున్నాయని చెప్పారు. యూనివర్సిటీలోని అధ్యాపకులకు మూడు దశలుగా సిఎఎస్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పించామని తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్లు, టైం స్కేల్ ఎన్ ఎం ఆర్ ఉద్యోగులకు వేతనాలు పెంచామని అన్నారు. బోధనేతర ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి ఉద్యోగోన్నతి కల్పించినట్టు చెప్పారు. హోం సైన్ విభాగంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ. 10 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో రూ. 5 కోట్లు తొలి దశ నిధులు మంజూరైనట్టు వివరించారు. ప్రత్యేకంగా పరీక్షల విభాగం భవనం రూ. 7 కోట్లు తో నిర్మించినట్టు చెప్పారు. రూ. 7 కోట్లతో బాలికల హాస్టల్, రూ. 7 కోట్లతో బాలుర హాస్టల్ భవనాల్ని పూర్తి చేసినట్టు తెలిపారు. రూ. 2.5 కోట్ల వ్యయంతో ఫార్మసీ కాలేజీ మొదటి అంతస్తు భవన నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. ఇంజనీరింగ్ కాలేజీలో పూర్వవిద్యార్థుల సహకారంతో 500 మంది అమ్మాయిలకు వసతి సదుపాయం కోసం హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం- 2020 ను పటిష్టంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 110 కోట్లు అదనపు నిధులు సమీకరించి రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించవలసిన అన్ని రకాల బకాయిల్ని అందించినట్లు తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్లకు 110 అమలు చేశామని ఎస్వీయూ రిజిస్ట్రార్ వెల్లడించారు. తన మూడేళ్ల పదవీకాలంలో తనకు అన్ని విధాలుగా సహకరించిన విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులకు ఈ సందర్భంగా వీసీ రాజారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్, డీన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్ డేవిడ్ మోహన్ కుమార్ రాజు, పాలకమండలి సభ్యులు మంజుల, సుమకిరణ్ పాల్గొన్నారు..

కామాటి..
వేతనం సరిపోయేది ఏపాటి.!

- జీతంలో కోతలు.. కార్మికుల వెతలు
- అయోమయంలో సాంఘీక సంక్షేమ ఔట్ సోర్సింగ్ కార్మికులు

చేయించుకొనేది బండెడు చాకిరీ.. పైగా చెల్లింపుల్లో కోత.. అధికారులను నుంచి ఎటువంటి స్పష్టత రాకపోవడంతో సాంఘీక సంక్షేమశాఖలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల వెతలు వర్ణనాతీతంగా ఉంది.

-ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్



ఉమ్మడి జిల్లాలో 330మంది ఔట్ సోర్సింగ్ విధానంలో కామాటి, వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారు. 30రోజులకు ప్రభుత్వ నెలకు రూ.13085జీతాన్ని వీరికి చెల్లిస్తోంది. అయితే అక్టోబర్ నెలలో మూడు రోజుల వేతనాన్ని కోత విధించి 27 రోజులకు మాత్రమే వేతనాన్ని చెల్లించింది. కేవలం రూ.11వేల జీతం మాత్రమే బ్యాంకులో జమైంది. 30 రోజులకు హాజరైనట్లు సంతాకాలు చేయించుకొని సంక్షేమశాఖ డిడి కార్యాలయానికి పంపితే 27రోజులకు మాత్రమే వేతనం జమ కావడంతో కార్మికులు అయోమయంలో పడ్డారు.

దాదాపు రూ.4లక్షలు హుష్‌కాకి.?

కార్మికులకు అక్టోబర్ నెలలో విధించిన కోతతో 330మందికి గానూ రూ.4లక్షలు నష్టపోయారు. అయితే ఎందుకిలా జరిగింది ఎవరి అలసత్వంపై ఇలా చేశారనే విషయాన్ని అధికారులను నిలదీయడానికి కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల వేతనం ఏమైనట్లు అని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాలో విలీనమైన కార్మికులకు పూర్తి వేతనం జమైనట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు సంబంధించిన కార్మికుల జీతాల్లోనే కోత విధించడంపై అసహనం వ్యక్తమవుతున్న పరిస్థితి. ఇకనైనా అధికారులు మూడు రోజుల వేతనంలో విధించిన కోతలకు సంబంధించి స్పష్టత ఇవ్వాల్సి ఉందని కార్మికుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సరిహద్దుల్లో గజ..గజ..!

- పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు

ప్రజాశక్తి-వికోట: కర్నాటక, తమిళనాడు సరిహద్దులను ఆవాసాలుగా ఏర్పరచుకున్న ఏనుగులు పంటలపై దాడులు కొనసాగిస్తున్నాయి. పగలంతా అటవీ ప్రాంతంలో ఉండి రాత్రైతే పంటలపై స్వైరవిహారం చేస్తున్నాయి. చేతికందే పంటలను పెకలించి.. అందినకాడికి తిని మిగిలింది తొక్కి నాశనం చేస్తున్నాయి. చేతికందే పంటలు దాడుల్లో నాశనమవుతుంటే రైతులు బోరున విలపిస్తున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని గొంతెత్తి వేడుకుంటున్నారు. కుంకీ ఆపరేషన్ చేపట్టాలని అధికారులను ప్రాదేయపడుతున్నారు. గురువారం రాత్రి వికోట మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ పంట పొలాలపై 15ఏనుగుల గుంపు దాడులు చేశాయి. రైతు సురేష్‌కు చెందిన మొక్కజొన్న, వరి పంటలను తొక్కి నాశనం చేశాయి. చేతికందే పంట రాత్రి ఏనుగుల దాడిలో ధ్వంసం కావడంతో కన్నీటి పర్యంతమై ఆందోళన వ్యక్తం చేశాడు. సుమారు రూ.2లక్షల మేరా నష్ట వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. జరిగిన పంట నష్టానికి అధికారులు పరిహారం ఇప్పించాలని కోరారు.



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్క జొన్న తోటను చూపుతున్న రైతు

వ్యాపారి కిడ్నాప్.. కలకలం?

- ఆర్థిక లావాదేవీలే కారణమంటూ వదంతులు

ప్రజాశక్తి-వికోట: వికోటకు చెందిన వ్యాపారి కిడ్నాప్‌కు గురైనట్లు శుక్రవారం స్థానికంగా కలకలం రేపింది. అర్బన్ సిఐ లింగప్ప కథనం మేరకు.. మండలంలోని కొత్తచిన్నేపల్లికి చెందిన వ్యాపారి సతీష్ గురువారం రాత్రి పలు వివాహ కార్యక్రమాలకని ఇంట్లోంచి బయలుదేరాడు. శుక్రవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన అతని భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వివాహాలకు హాజరై తిరిగి వస్తుండగా బైరుపల్లి సమీపంలో కారును అడ్డగించి గుర్తు తెలియని వ్యక్తులు సతీష్‌ను కిడ్నాప్ చేశారని, కారును అదే ప్రాంతంలో విడిచి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆర్థిక లావాదేవీల విషయంలో కిడ్నాప్ జరిగుండొచ్చని స్థానికంగా వదంతులు వినిపిస్తున్నాయి. పోలీసులు పలు కోనాల్లో దర్యాప్తు చేపడుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

ప్రజాశక్తి - వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా): సరిగ్గా నెల్లూరులో జరిగిన ఘటన లాంటిదే... చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పచ్చికాపలం సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగింది. తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై కారు డ్రైవర్ దాడిచేసిన ఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అల్లెయ్య చెప్పిన వివరాల మేరకు...



తిరుపతి డిపోకు చెందిన డ్రైవర్ ఈశ్వరయ్య ఏపీ 03 జెడ్. 5302 నంబర్ గల బస్సు డ్రైవ్ చేస్తూ తిరుపతి నుంచి పళ్లిపట్టు(తమిళనాడు రాష్ట్రం)కు 50 మంది ప్రయాణికులతో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో వెదురుకుప్ప మండలం పచ్చికాపల్లం సచివాలయం సమీపంలో పెట్రోల్ బంక్ దగ్గర ఎపి 03 బిపి 1584 నంబర్ గల కారు రోడ్డుపై ఆపి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఉన్నాడు. డ్రైవర్ హారన్ కొట్టి కారు పక్కన పెట్టమని చెప్పాడు. దీంతో కారు యజమాని అనుచరులతో కలిసి డ్యూటీలో ఉన్న డ్రైవర్నును కిందికి లాగి దుర్భాషలాడి పిడిగుద్దులు గుద్ది దాడి చేశారు.

ఒకరిని గుర్తించాం : ఇన్‌ఛార్జి ఎస్ఐ దస్తగిరి

దాడికి పాల్పడిన వారిని వీడియోలు ఆధారంగా గుర్తించాం. అతనిది మాంబేడు పంచాయతీ పరిధిలోని ధర్మాచారు గ్రామానికి చెందిన మోహన్. అనుచరులను గుర్తించే పనిలో ఉన్నాం.

ఫిర్యాదు చేసాం : తిరుపతి డిపో సిబ్బంది

ఆర్టీసీ డ్రైవర్ ఈశ్వరయ్య పై దాడి చేసిన వారిని శిక్షించాలని తిరుపతి డిపో సిబ్బంది తిమ్మారెడ్డి వెదురు కుప్పం పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఈశ్వరయ్యతో కలిసి ఫిర్యాదు చేశారు. ఇన్చార్జి ఎస్ఐ దస్తగిరి సానుకూలంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మరలా ఇలాంటి సంఘటన పునరావతం కాకుండా చూడాలని కోరారు.

ఎస్వీయూ ఇన్‌ఛార్జి విసిగా సుందరవల్లి

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా మూడు సంవత్సరాల పదవి కాలం పూర్తి కావడంతో ఆచార్య కే. రాజారెడ్డి శుక్రవారం పదవి విరమణ చేశారు. ఆచార్య కే.రాజారెడ్డితో పాటు దాదాపుగా రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల విసిల పదవీకాలం నేటితో ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో మొత్తం ఐదు విశ్వవిద్యాలయాలకు రాష్ట్రంలో ఇన్చార్జ్ విసిలను నియమించింది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు ఈ మేరకు ఉత్తర్వులు పంపించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి ఇన్చార్జి ఉప కులపతిగా నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వీసి ఆచార్య జిఎం సుందరవల్లిని, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసి ఆచార్య డి. భారతిని, శ్రీ కష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్చార్జిగా యోగి వేమన విశ్వవిద్యాలయం వీసి ఆచార్య సుధాకర్ ను, కర్నూల్ రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్చార్జి ఉపకులపతిగా అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విసి రెహమాన్ ను, ఆంధ్ర యూనివర్సిటీ కి ఆంధ్ర యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య సమతాను ఇంచార్జ్ విసి గా నియమించారు. ఇన్చార్జి విసిగా ఆచార్య జీఎం. సుందరవల్లి శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగానికి చెందిన ఆచార్య జిఎం సుందరవల్లి సంవత్సరం క్రితం నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వెళ్లారు. తిరిగి ఎస్వీయూ ఇన్చార్జ్ ఉపకులపతిగా రావడం పట్ల బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు

27న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఇంఛార్జ్ ఎంపిడిఓ సుధాకర్ తెలిపారు. కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-కుప్పం: మండలంలోని గ్రామ పంచాయతీ కేట ఇండ్ల జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మార్కండేయులు తెలిపారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న లహరి, ప్రియ, 9వ తరగతి చదువుతున్న భాను తేజలు ఎంపికైయ్యారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అండర్19 బాలబాలికల జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. డిసెంబర్‌లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను పిడి లోకేశం, విద్యార్థులను ఆయన అభినందించారు.

బొల్లిఆవులపల్లి ఇండ్లుకు రాకపోకలు బంద్

- రెవెన్యూ జోక్యంతో దారి సమస్యకు పరిష్కారం



ఏర్పాటు చేసిన కంచెను తీయిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఇరువర్గాల మధ్య ఏర్పడ్డ తగువులతో బొల్లిఆవులపల్లి ఇండ్లు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని గంటావారిపల్లిలో రైతు మధుసూదనరెడ్డికి మరో వ్యక్తి మధ్య భూవాగ్వాదం ఏర్పడింది. దీంతో గురువారం రాత్రి మధుసూదనరెడ్డి తన పొలంలోని దారికి కంచె ఏర్పాటు చేశాడు. రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో బొల్లిఆవులపల్లి గ్రామస్తులు శుక్రవారం రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. ఈ విషయంగా స్పందించిన తహశీల్దార్ జయంత్‌కుమార్, వీఆర్‌వో సాంబశివారెడ్డి రైతులను ఒప్పించి దారికి కంచెను తీయించి సమస్యను పరిష్కరించారు.

మాసపత్రిక ఆవిష్కరణ



మాసపత్రిక ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: మంగళ విద్యానిధి మాసపత్రిక 25వ సంచికను జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆవిష్కరించారు. మంగళపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులచే పత్రిక నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి మాస పత్రికను నిర్వహించడం అభినందనీయం అని, భవిష్యత్తులో మాసపత్రిక నిర్వహణకు ఎటువంటి సహాయానికైనా తనను సంప్రదించాలని కోరారు. అలాగే గణిత ఉపాధ్యాయుడు, అవధాని హెచ్.అరుణ శివప్రసాద్ పాఠశాల విద్యార్థులచే నిర్వహించే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని ప్రోత్సహించాలని ప్రజ్ఞాధారణ కార్యక్రమము రాష్ట్రములోనే ప్రథమమని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రాజలక్ష్మి, సంజీవి, పిల్లారప్ప, భారతి పాల్గొన్నారు. 25వ సంచిక దాత త్యాగరాజులునాయుడును కలెక్టర్ సత్కరించారు.

లక్ష్యసాధనలో ముందుండాలి

-డాక్టర్ అనిల్‌కుమార్



ప్రజాశక్తి-యాదమరి: ప్రభుత్వ నిర్దేశించిన కార్యక్రమాల అమలు సాధనలో ముందుండాలని యాదమరి డాక్టర్ అనిల్ కుమార్‌నాయక్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్ర స్థాయి సిబ్బంది సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భవతుల నమోదు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేటకు చెందిన పలువురు ముస్లింలు పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. 11రకాల నిత్యావసర సరుకులను 12నిరుపేద కుటుంబాలకు శుక్రవారం అందజేశారు. వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా కమిటీగా ఏర్పడి ప్రతినెల పేదలకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అస్లాం, దావూద్, అల్తాఫ్, ఖాను పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక దినోత్సవం

ప్రజాశక్తి-శాంతిపురం: యోగానంద విద్యాలయంలో ఘనంగా 23వ వార్షిక దినోత్సవం జరిగాయి. కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపల్ ఆజాద్‌హుస్సైన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మరాజు ఆలయానికి భూమి పూజ

ప్రజాశక్తి-శాంతిపురం: మండలంలోని కర్లగట్టలోని పురాతన ధర్మరాజుల ఆలయ నిర్మాణానికి ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.10కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ దండపాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి రావాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి రావాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ మండల సమావేశం మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో జరిగినది. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులకు విద్యపై ధ్యాస ఉంచకుండా యాప్లపై ఉంచుతున్నారని రోజుకో రకం యాప్ ను సృష్టించి అందులో ప్రతిపాదనలో సిద్ధం చేయమనడం వలన ఉపాధ్యాయులకు పని ఒత్తిడి అధికమైపోతున్నదన్నారు. అందుకోసం పోరాడే తత్వం రావాలని అన్నారు. కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు సరిత, ధనంజయరాజు, మోహన్‌రెడ్డి, ప్రకాష్, బిర్లానాయుడు, వాసుదేవపిళ్లై, బాలాజీ, శివరంజని, అమూల్య పాల్గొన్నారు.

అతిగా మందులు వాడితే ముప్పే

- డిఎంహెచ్‌వో ప్రభావతిదేవి



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అతిగా మందులు వాడకంతో వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుందని డిఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి అన్నారు. శుక్రవారం చిత్తూరు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రపంచ ఆంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాలు' సందర్భంగా చివరి రోజు ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అతిగా యాంటీ బయోటిక్ మందులు వాడరాదన్నారు. అలా వాడితే వెనుకటికి మందులు పనిచేయవన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియా అధికారి శ్రీనివాసులు, ఎస్‌వో జార్జ్, డాక్టర్ సందీప్, డాక్టర్ శిరీష, శ్రీవాణి, గుణశేఖర్, జయరాముడు పాల్గొన్నారు.

26న యాదవుల ఆత్మీయ సభ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఈ నెల 26న యాదవ ఆత్మీయ సభ నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అశోక్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. జిల్లాలో 16-18శాతం వరకు యాదవ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. యాదవులకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించడం లేదని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని శాసన సభ స్థానంలో యాదవులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సముచిత స్థానం కల్పించే రాజకీయ పార్టీలతో కలిసి పనిచేస్తామన్నారు. చిత్తూరులో జరగబోయే ఆత్మీయ సమావేశానికి ముఖ్యులు పాల్గొంటారని వివరించారు. జిల్లాలోని యాదవులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కవితసురేష్, ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్ గౌరవ అధ్యక్షులు చినరాజులయాదవ్, ఫణియాదవ్, కృష్ణయ్య యాదవ్, గోవిందయ్య యాదవ్, గుణయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



ప్రజాశక్తి-సోమల: క్రీడా ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రజాప్రతినిధులు నగదు ప్రోత్సాహకంతో అభినందించారు. మండలంలోని నడింపల్లి పంచాయతీ సూరయ్యగారిపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సర్పంచ్ వెంకటరమణ, వైస్ ఎంపిపి ప్రభాకర్, పాఠశాల కమిటి ఛైర్మన్ సయ్యద్‌బాషాలు రూ.10వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

సంఘమిత్ర ఫిర్యాదు.. ఐదుగురిపై కేసు



ప్రజాశక్తి-సోమల: మండలంలోని కమ్మపల్లికి చెందిన ఐదుగురి మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. కమ్మపల్లికి చెందిన సుజాత, అమరావతి, మమత, అమ్ములు, సులోచనలు ఆరు నెలల క్రితం వివో పుస్తకాలు నమ్మకంగా తీసుకొని తిరిగి ఇవ్వలేదని సంఘమిత్ర ఫిర్యాదు చేసిందన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టిఎన్ఎస్ఎఫ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు పిలుపు




ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యార్థి మేలుకో.. భవిష్యత్తుని కాపాడుకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా టిడిపి కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లకు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ముత్తుప్రసాద్, గోకుల్, శ్రీరామతులసిరాయల్, ప్రభుతేజ, శ్రీరాం, జగన్, భార్గవ్, ప్రకాష్, చైతన్య పాల్గొన్నారు.

ఆర్బీకే యాప్‌తో ఎన్నో లాభాలు



ప్రజాశక్తి-నగరి: రైతులు స్మార్ట్ ఫోన్లలో వైఎస్సార్ ఆర్బీకే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఎన్నో లాభాలున్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో రైతులకు ఆమె ఆర్బీకే యాప్‌పై ప్రత్యక్ష అవగాహన ఏర్పరిచారు. యాప్ ఎలా ఓపెన్ చేయాలి, ఎప్పటికప్పుడు నోటిఫికేషన్ రావాలంటే ఏం చెయ్యాలని వారికి వివరించారు. ప్రతి రోజు పంట సాగుకు సంబంధిత అంశాలు, సూచనలు, మెలకువలు అందులో రైతులకు అందుతుందన్నారు. కొత్త వంగడాలు, వాటి సాగుకు పాటించవలసిన పద్ధతులు తెలుస్తుందన్నారు. ఇతర రాష్ట్రాలలో సాగుచేసే కొత్త తరహా పంటల గురించి కూడా తెలుసుకోవచ్చన్నారు. రైతులు తాము వాడడంతో పాటు ఇతర రైతులకు కూడా యాప్ గురించి వివరించాలన్నారు.

ఎన్‌సిసి వారోత్సవాలు



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనాత్తం జెడ్పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌సిసిస అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 14మంది ఎన్‌సిసి క్యాడెట్‌లో ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు హెచ్ఎం గోపాల్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

కరువు సాయం అందించండి..

లేకుంటే గద్దె దిగిపోండి..

- కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం నేతల నిరసన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ కరువు సహాయక చర్యలు సత్వరమే అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని సిపిఐ, రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం రైతు సంఘం, సిపిఐ రాష్ట్ర కమిటిల పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎస్.నాగరాజన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.జనార్ధన్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు కరాళనృత్యం చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. ఇటీవల చేపట్టిన ఆందోళనల ఫలితంగా తూతూ మంత్రంగా కరువు మండలాలను ప్రకటించారని ఆరోపించారు. జిల్లాలో 20కిపైగా మండలాల్లో కరువు ఛాయలు ఉన్నాయన్నారు. మంత్రికి, సీఎంకు కనబడకపోవడం దారుణమన్నారు. వరినాట్లు, వేరుశనగ పంటల్లో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నం నాయుడు, మనోజ్‌రెడ్డి, సిపిఐ నాయకులు చంద్ర, రఘు, బాలాజి పాల్గొన్నారు.

కబ్జాదారుపై చర్యలు తీసుకోవాల్సిందే

→ కృష్ణజిమ్మాపురం గ్రామస్తుల నిరసన



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తమ గ్రామంలో కబ్జాలకు పాల్పడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గుడిపాల మండలం కృష్ణజిమ్మాపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని గుడిపాల మండలం బందార్లపల్లి రెవెన్యూలోని బ్లాక్ నెంబర్ 55గుట్ట పోరంబోకు స్థలంలో కృష్ణాజిమ్మాపురం గ్రామానికి చెందిన సుబ్రమణ్యంనాయుడు, సురేష్‌నాయుడులు కలిసి 2001లో గంగన్న కుంట నిర్మాణం కోసం 70సెంట్లు డికేటి భూమిని ధారాదత్తం చేశారు. దీంతో ఆ భూమిలో గంగన్న పేరుపై కుంటను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కృష్ణజిమ్మాపురంతో పాటు పరిధిలోని మూడు గ్రామాల ప్రజలు తమ పశువులను గుట్ట పోరంబోకులో మేపుకొని సంబంధిత గంగన్నకుంటలో నీళ్లు తాపించుకునేవారు. అయితే తాజాగా కుంటకు అనుకునే ఉన్న సర్వేనెంబర్ 261కి సంబంధించి 7 ఎకరాలకు పైగా డీకేటి భూమి ఉన్న బాలకృష్ణనాయుడు కుంట భూమిలో ఎకరా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వ భూమితో కలిపి అక్కడ ఉన్న గుట్టను చెరువుగా ఏర్పాటు చేసుకొని పశువుల నేత భూమిగా చెరువుగా వినియోగంలో తెచ్చామని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఈ చెరువును పక్క గ్రామానికి చెందిన బాలకష్ణనాయుడు అనే వ్యక్తి అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంగన్నకుంట కబ్జాకు పాల్పడితే చర్యలు

బాలకృష్ణమనాయుడు గంగన్నకుంట భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్తులు మా దృష్టికి తీసుకొచ్చారు. బాలకృష్ణమనాయుడు సంబంధించిన భూమికి సర్వే చేసి హద్దులు నిర్ణయించాం. అదే విధంగా గంగన్నకుంట భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవు. **- తహశీల్దార్ రాజేంద్రప్రసాద్, గుడిపాల**

పరిశుభ్రత పాటిద్దాం

- సర్పంచ్ రమేష్‌బాబు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: పరిసరాల పరిశుభ్రతకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సర్పంచ్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పొట్టిగానిపల్లిలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ పథకం ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేస్తోందని, ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.15వేలు నేరుగా లబ్దిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఆరుబయట మలవిసర్జన చేస్తుంటారని ఇలా చేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు అనేకం అని వాటిని ఎదుర్కోవలసి వస్తుందన్నారు. మహిళలు తమ ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఇలాంటి పథకాలు అమలు చేస్తోందని ప్రజలు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పరంధామ, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్, వాలంటీర్ వినోద్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వైసిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని బోడబండ్ల సచివాలయంలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, మొగిలిశ్వర, హరి, చంద్రయ్య, కిషోర్ కుమార్‌రెడ్డి, జగదీష్, మహేంద్ర పాల్గొన్నారు.

కార్వేటినగరం: పేదలు ఆర్థికంగా ఎదగాలంటే రాష్ట్రానికి సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అవసరం అని వైసిపి మండల కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపురం సచివాలయ పరిధిలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ ధనశేఖర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పురందర్, సింగిల్విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, కోప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, లోకనాథ నాయుడు, ఎంపీడీవో మోహన్‌మురళి, ఈవోఆర్డి లక్ష్మీపతి , శోభన్ బాబు, అర్జునయ్య పాల్గొన్నారు.

సదుం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైసిపి మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి అన్నారు. శుక్రవారం పాలమంద, ఊటుపల్లి, చింతలవారిపల్లి పంచాయతీల పరిధిలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, వీరబల్లి రెడ్డెమ్మ, నారాయణరెడ్డి, ఎం పిపి ఎల్లప్ప, జెడ్పిటిసి సోమశేఖర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వైస్ ఎంపిపి అమరావతి, స్వరూప, గుణాకర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామకుప్పం: సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కుప్పం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం తండాలో వైసిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రహ్మణ్యం, నాయకులు బాబురెడ్డి, చంద్రారెడ్డి, కేశవరెడ్డి, మోహన్‌నాయక్, మంజునాథ్, లోకేష్‌నాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లి పంచాయతీలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ వనజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీలో చేపట్టిన రూ.47కోట్ల సంక్షేమ, అభివృద్ధి పనులకు సంబంధించి సమాచార బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సర్వేశ్వరమ్మ, నాయకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

పోటాపోటీగా కబడ్డీ

- చౌడేపల్లిలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలు
- హాజరైన ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



ప్రజాశక్తి-చౌడేపల్లి: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమైయ్యాయి. చౌడేపల్లిలో రాష్ట్ర స్థాయి అండర్17 బాలబాలికల కబడ్డీ పోటీలను ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిలు ర్పారంభించారు. ముందుగా 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చౌడేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పిటిసి దామోదర్‌రాజు, ఎంపిపి గాజుల రామూర్తి, నాయకులు కిషోర్, జీవన్‌ప్రకాష్, లీలాకుమార్, శ్రీరాం భరత్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే చేయాలి: డిఎల్‌డిఒ



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌డివో సుశీలదేవి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే నిర్వహించాలని తిరుపతి జిల్లా డిఎల్‌డిఓ సుశీల దేవి పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘం, మండల పరిషత్ కార్యాలయంలో కుల గణన సర్వేపై వార్డు, సచివాలయం కార్యదర్శులు, వాలంటీర్లకు శుక్రవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ఇంటి యజమానుల వద్దే సమాచారం అడిగి తెలుసుకుని వివరాలు, వారి చేసే పనులు, అద్దె గృహమా సొంత గృహమా? వారి కులాలు వివరాలు రాసుకోవాలని మొత్తం వివరాలను సర్వే చేయాలని తెలిపారు. వాళు ఇంట్లో వున్న సమయంలోనే వాలంటీరు వెళ్లి సర్వే చేయాలన్నారు. 7.01. డౌన్‌లోడ్ చేసుకుని వాటి ద్వారా సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కే ఎల్ ఎంఎన్ రెడ్డి, తపశీల్దారు పరమేశ్వర స్వామి, ఎంఈఓ తిరుమలరాజు, ఈఓఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

దుస్థితిలో ఆలత్తూరు రోడ్డు

గుంతలలో పేపరు పడవలతో నిరసన



ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: గుంతలమయమైన ఆలత్తూరు రోడ్డు దుస్థితిని పట్టించుకోవాలని కోరుతూ టిడిపి, జనసేన నాయకులు పేపరు పడవలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఆలత్తూరు రోడ్డు మార్గంలో ఆలత్తూరు, పిల్లేటి వారి కండ్రిగ , పుతేరి మూడు గ్రామ పంచాయ తీలలోని 15 గ్రామాలకు ఈ రహదారి ఉపయోగ కరంగా వుంటుందని, ప్రతి అడుగుకు గుంతల మయమైందని, ఈ గుంతలు రెండు నుంచి మూడు అడుగుల లోతులో వుండడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఈ మార్గంలో వస్తున్న ఆలత్తూరు బస్సును రహదారి అధ్వానంగా ఉన్న కారణంగా అప్పుడప్పుడూ నిలిపివేస్తు న్నారన్నారు. ప్రతిరోజూ 40 నుంచి 60 టన్నుల మెటల్ టిప్పర్లు సుమారు 100 టిప్పర్లు ఈ రహదారిపై తిరు గుతున్నాయని, వాటి ద్వారా మెటల్ రాయల్టీ వసూలు చేస్తున్న ప్రభుత్వం కనీసం రహదారికి మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు మెయింటెనెన్స్ నిధులు కూడా విడుదల చేయించలేని అసమర్థత కారణంగా అధ్వాన స్థితికి ఈ రహదారి అద్దం పడుతోందని, అధిక లోడుతో వెళుతున్న టిప్పర్ల వద్ద అధికారులు మామూళ్ల వసూళ్లు చేసుకుంటూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. నిరసనగా బుచ్చినాయుడు కండ్రిగ మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఈ రహదారి గుంతలలో పేపర్ పడవలతో నిరసన తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు యం సుధాకర్ నాయుడు, క్లస్టర్ కన్నయ్య నాయుడు, సురేష్ బాబు, రవీంద్రబాబు, సుధాకర్, ఆనంద్, కుమార్ శెట్టి, గురవయ్య, బాబు, వీర రాఘవులు, హరి, శ్రీనివాసులు, చిరంజీవి రెడ్డి జనసేన నాయకులు నవీన్, బాలాజీ పాల్గొన్నారు.